మొక్కలతో మానవాళి మనుగడ


ఆమనగల్లు: మేడిగడ్డ తండాలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే


కడ్తాల్: విద్యార్థితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కల్వకుర్తిలో 66లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- పాఠశాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆమనగల్లు: మానవాళి మనుగడకు మొక్కలు అవసరమని, మొక్కలు నాటడం అందరి బాధ్యతగా గుర్తించాలని, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి పరిధిలో 66లక్షల మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మేడిగడ్డ తండాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అనిత, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ దేవేందర్, ఎంపీడీఓ కుసుమమాధురిలతో కలిసి ఎమ్మెల్యే మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకంపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రజల బాధ్యత అని ఆయన వివరించారు. నానాటికి తగ్గిపోతున్న అటవీప్రాంతాన్ని పెంచాలంటే తప్పకుండా ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలను నాటాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటడాన్ని ఒక పండుగలాగా చేయాలనే సంకల్పంతో వన మహోత్సవం పేరుతో కార్యక్రమం చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజలంతా దీంట్లో భాగస్వాములు కావాలని, ఇంటికో మొక్కను నాటి సంరక్షించాలని ఆయన సూచించారు. చెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో వర్షాలు కూడా అధికంగా కురుస్తాయన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, రోడ్డుకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, కార్యదర్శి వెంకటయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, పట్టణ అధ్యక్షుడు మానయ్య, కాంగ్రెస్ నాయకులు మెకానిక్ బాబా, విజయ్‌రాథోడ్, కృష్ణ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, పర్వతాలు, ప్రసాద్, ఖాదర్, మైసయ్య, రాఘవేందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

కడ్తాల్: విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. పాఠశాలలో వంట గదితో పాటు వసతి, సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు? ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? పాఠశాలలోని సమస్యలను హెచ్ఎం బాల్‌రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో పలు తరగతులను పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి వారి అభ్యసన తీరుతెన్నులను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో విద్యా బోధన అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యతోనే భవిష్యత్ ముడిపడి ఉందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, వసతులను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యా బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, హీరాసింగ్, బాలరాజు, జహంగీర్‌అలీ, శేఖర్‌గౌడ్, హీరాసింగ్, జవహర్‌లాల్, తులసీరాం, అమర్‌సింగ్, షాబుద్దీన్, కిషన్, రాందాస్, భగత్, పీటర్, విజయ్, కార్యదర్శి సత్యం ఉపాధ్యాయులు ఉన్నారు.

నిరుద్యోగ భృతి ప్రకటించాలి

బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ తాలూకా కన్వీనర్ అనిల్

తలకొండపల్లి: మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించి, నిరుద్యోగులకు రూ. 4వేలు భృతిని ప్రకటించాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ తాలూకా కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ పిలుపు మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేవైఎం నాయకులు మహా ధర్నా నిర్వహించారు. అనిల్ ఆధ్వర్యంలో తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల్ మండలాలతో పాటు, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రూప్ 2లో 783 పోస్టుల నుంచి 2000లకు పెంచాలని అదే విధంగా గ్రూప్ 3లో 1365 పోస్టుల నుంచి 3000లకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భగీరథ, మహేష్, మధు, శివ, సతీష్, బన్నీ, రాజు, ఆనంద్, సుధాకర్, కర్ణాకర్, భాను, భాస్కర్ పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ


ఆమనగల్లులో ఫొటోట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలోని అయ్యప్పకొండపై శనివారం ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో నిర్వహించనున్నారు.

ఆమనగల్లు మండల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ సంక్షేమసంఘం అధ్యక్షుడు కాడిగ సత్యం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రఫి, వీడియోగ్రఫిలో మార్పులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమసంఘం ప్రధాన కార్యదర్శి జావేద్, కోశాధికారి వెంకటేశ్, సభ్యులు శ్రీశైలంయాదవ్, శివ, బిక్కు, రఫి, జబ్బార్, రాజు, గణేశ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో మండల ఫొటో యూనియన్ ఆధ్వర్యంలో ఫొటో ఎక్స్ పో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మండల అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి మహేశ్, కోశాధికారులు రమేష్, విజయ్, గౌరవ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, రవూఫ్, అంజనేయులు, కిరణ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం


ఆరుట్లలో క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఏక కాలంలో రూ. 2లక్షలు రుణమాఫీ చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుగ్గరాములు, సురేశ్, రాజుగౌడ్, యాదయ్యగౌడ్, నర్సింహ, కృష్ణ, రమేశ్, యాదగిరి, పరమేశ్, భాస్కర్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఇబ్రహీంపట్నం: చలో కలెక్టరేట్ ముట్టడి వాల్ పోస్టర్‌ను శనివారం ఎస్ఎఫ్ఐ నేతలు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు వంశీ, తరంగ్‌లు మాట్లాడారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముట్టడి సోమవారం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8212 కోట్ల బకాయిలుండగా అందులో రంగారెడ్డి జిల్లాకు రూ.730 కోట్ల బకాయిలు రావాల్సివున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించిన గీతారెడ్డి


రైతు గణేశ్‌తో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గీతారెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతు రుణామాఫీపై లబ్ధిదారులతో జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి శనివారం సాయంత్రం నేరుగా ముచ్చటించారు. ఇబ్రహీంపట్నంకు చెందిన రైతులు మంగళ్‌పల్లి గణేశ్‌కు రూ. 99,885, జెర్కొని బాలయ్యకు రూ. 84,679, జలమోని రవీందర్‌కు రూ. 73,237లు రుణమాఫీ అయ్యాయి. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వరప్రసాద్, ఏఈఓ రఘులతో కలిసి నేరుగా రైతుల ఇండ్లకు వెళ్లి రుణమాఫీపై గీతారెడ్డి ఆరా తీశారు. ఒకేసారి పెద్ద మొత్తంలో రుణాలను మాఫీ చేయడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో రుణా మాఫీ కావడంతో కొత్త రుణాలు తీసుకొని పంటల సాగుకు కొత్త ఖర్చు పెట్టేందుకు అవకాశం కలిగిందని రైతులు వెల్లడించారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన సిద్దమోని దుర్గయ్య ఆకస్మికంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలకూర్ల రాములు గౌడ్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో స్థానిక నాయకులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటాపోటీగా నామినేషన్లు


నామినేషన్ వేసిన రాజేందర్‌గౌడ్, నరేశ్

కడ్తాల్: యూత్ కాంగ్రెస్ కడ్తాల్ మండల అధ్యక్ష పదవికి మండల పరిధి నుంచి పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆన్‌లైన్ ద్వారా వారి అభ్యర్థిత్వాలను నమోదు చేయించారు. మండల కేంద్రానికి చెందిన కందికంటి రాజేందర్‌గౌడ్, బోసురవి, ముద్విన్ నుంచి గంట నరేశ్, యెన్నం మనీశ్‌రెడ్డి, ఈర్లపల్లి మల్లేశ్, మైసిగండి నుంచి కేతావత్ సుమన్‌నాయక్, కేతావత్ తులసీరాం, వినోద్‌కుమార్, ఎక్వాయిపల్లి నుంచి జంగం ఆకాశ్‌గౌడ్, రాత్లవత్ కృష్ణ అధ్యక్ష పదవికి నామినేషన్ వేసినట్లు సమాచారం. నామినేషన్లకు శనివారం చివరి రోజు కావడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు.. యూత్ కాంగ్రెస్ సభ్యులు, నాయకులను కలిశారు. పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి పనిచేస్తామని, పార్టీ మరింత బలోపేతమయ్యేలా కృషిచేస్తామని పేర్కొంటూ.. తమను ఆదరించాలని కోరుతున్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు సర్వం సిద్ధం

- కొంగరకలాన్‌లో 13వ వార్షికోత్సవ వేడుకలు
- ప్రత్యేక అలంకరణలో స్వామివారి దర్శనం


ఇబ్రహీంపట్నం రూరల్: రుద్రాభిషేకం చేస్తున్న ధర్మకర్తలు రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: గురుపౌర్ణమి వేడుకలకు కొంగరకలాన్‌లోని షిరిడిసాయిబాబా దేవాలయం సిద్ధమైంది. ఆలయ ధర్మకర్తలు కల్వకోలు చంద్రకళ రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో కొలువుదీరినటువంటి సద్గురు సాయినాథుడి క్షేత్రంలో 13వ వార్షికోత్సవ వేడుకలకు ఏర్పాట్లు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం కాకడ హారతి, సుప్రభాతం, కలశస్థాపన, మంటపారాధన, శతఘటాభిషేకం తీర్థ ప్రసాదాలు అందజేసే కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సాయిబాబాకు రుద్రస్వహకారములు, మధ్యాహ్న హారతి, ప్రదోష పూజలు, చతుర్వేద అవధారయములు, హారతి మంత్రం, మంత్రపుష్పం సాయి నామస్మరణంతో సంకీర్తనలు నిర్వహించారు. బ్రహ్మశ్రీమాడ్గుల ప్రకాశ శర్మ బృందం ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీనికి మాజీ మంత్రి సబితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని షిరిడిసాయి బాబా దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహించనున్నారు. దీనికోసం షిరిడి సాయిబాబా దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఆలయంలో ఉదయం సుప్రబాతం, కాగడహారతి, సాయినాధునికి మంగళస్నానం, సంస్థాన్‌హారతి, అర్చనలు, పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని శ్రీ భక్తమార్కండేయస్వామి దేవాలయంలో గురుపౌర్ణిమ సందర్భంగా ఉమా మహేశ్వరస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నాగభూషణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీకి పంపండి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత


అక్షరాభ్యాసం చేయిస్తున్న మమత

తలకొండపల్లి: ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి, కేంద్రం సేవలు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. అంగన్‌వాడీలు పంపిణీ చేసే పోషకాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని 1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన, అక్షరభ్యాసం చేయించారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు అంగన్‌వాడీలు బాటలు వేసేందుకు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆటపాటలతో విద్యను అందించి, చిన్నారులకు చదువుపై ఆసక్తిని పెంపొందిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, యాదమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించండి

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి


శివాల్కర్ యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మాడ్గుల: విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మండల విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివాల్కర్ యాదవ్‌ను శనివారం షాద్‌నగర్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో కలిసి వారిని శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా బట్టు కిషన్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ పాల బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. ఎంతో మంది పాడి రైతులు పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడి విజయ డెయిరీ నుంచి ప్రతీరోజు పాలు సరఫారా చేస్తున్నారన్నారు. బిల్లుల చెల్లింపు సకాలంలో జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో తక్షణమే స్పందించి బకాయిలు విడుదల చేయించాలని కోరారు. ఈ విషయంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివాల్కర్ యాదవ్ సానుకూలంగా స్పందించి, డెయిరీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారన్నారు.

దాతను ఆదర్శంగా తీసుకోవాలి

మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి


గ్రంథాలయం ప్రారంభిస్తున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

మంచాల: పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేస్తున్న డాక్టర్ ఎస్.కె.బిక్షపతిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ వెంకట్‌రెడ్డి సూచించారు. తాళ్లపల్లిగూడ ప్రభుత్వ పాఠశాలలో దాత బిక్షపతి.. సొంత డబ్బులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయగా.. శనివారం ఎంఈఓ ప్రారంభించారు. అనంతరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు క్యాలిక్లేటర్లు, ట్యాబులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. చిన్న తనంలో చదువుకోసం పడిన ఇబ్బందులు మరొకరు పడకూడదనే.. దాత బిక్షపతి పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. పదేళ్లగా మండల పరిధి పాఠశాలల్లో టెన్త్‌లో ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు, ఉన్నత చదువులకు కావాల్సిన మెటీరియల్ అందజేస్తున్నారని తెలిపారు. విద్యకు దూరమవుతున్న వారిని చేరదీసి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సూర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసురుకుంది..!

- వర్షంతో మెట్ట పంటలకు ప్రాణం
- వరి నాట్లతో రైతన్నలు బిజీబిజీ


చౌదర్‌పల్లి గ్రామంలో పత్తి పంటకు ఎరువులు పెడుతున్న మహిళలు

యాచారం: కురుస్తున్న వర్షాలతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. వానాకాలం ప్రారంభంలో వర్షాలు కురియకపోవడంతో మెట్ట పంటల సాగు ఆలస్యమైంది. తడిపొడి భూమిలోనే రైతులు పత్తి విత్తనాలను విత్తారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలకు పైగా ఉండగా, ప్రస్తుతం 10వేల ఎకరాల వరకే సాగైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల్లోని రైతులు కొందరు పత్తి విత్తనాలను విత్తుతున్నారు. మరి కొందరు నెల కింద విత్తిన పత్తి పంటకు ఎరువులు వేస్తూ, కలుపు తీస్తున్నారు. రోహిణి కార్తెలో వరి నార్లు పోసిన రైతులు కరిగట్టు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, చింతుల్ల, గునుగల్, గడ్డ మల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో పత్తి, వివిధ రకాల కూరగాయల పంటల సాగు చేస్తున్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు

తలకొండపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరహార దీక్ష శనివారానికి 6వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, రూ.2 వేల వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజమ్మ, జంగమ్మ, మల్లమ్మ, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు

కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు సురేశ్

తలకొండపల్లి: నిరుద్యోగుల బాధలు తెలుసుకొని గ్రూప్ 2ను వాయిదా వేసిన ప్రజా నాయకుడు సీఎం రేవంత్‌రెడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ విద్యార్థి యువ నాయకుడు పెరుమాండ్ల సురేశ్ పేర్కొన్నారు. గ్రూప్ 2 అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించడం అభినందనీయమని తెలిపారు. గతంలో పాలించిన ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గోడును ఏనాడు పట్టించుకున్న పాపానా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్


పతీక్‌జైన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను శనివారం ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ప్రతీక్‌జైన్‌ను కలిసి రాంపాల్‌నాయక్ పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ విజయ్‌కృష్ణ తదితరులు ఉన్నారు.

మండల అధ్యక్ష పదవికి రాజేందర్ పోటీ

తలకొండపల్లి: తలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని కర్కాస్ తండాకు చెందిన సబావట్ రాజేందర్ నాయక్ పోటీ చేస్తున్నారు. శనివారం ఆయన ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

ఏఈ సందీప్‌కుమార్

యాచారం: వర్షాలతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ ఏఈ సందీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలను, స్తంభాలకు ఆనుకుని ఉన్న ఇంటి గోడలకు, మోటార్ స్టాటర్లు, తెగిపడిన విద్యుత్ తీగలను ముట్టుకోవద్దని, తడి బట్టలను ఇనుప విద్యుత్ వైర్ల మీద ఆరవేయొద్దని పేర్కొన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య ఉన్నా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా స్థానిక విద్యుత్ సిబ్బందికి సమాచారం చేరవేయాలని పేర్కొన్నారు. తమ సొంత ఆలోచనతో, తొందరపాటుతో మరమ్మతులు చేయొద్దని ఆయన సూచించారు.

చెత్త వేసే వారిపై చర్యలేవి?


కమ్మగూడలోని లక్ష్మీనగర్ రోడ్డు పక్కనే పడేసిన చెత్త

తుర్కయంజాల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని మున్సిపల్ అధికారులు ప్రచారం నిర్వహిస్తున్న ప్రజల్లో మాత్రం అవగాహన రావడం లేదు. ఎక్కడికక్కడ ఖాళీ స్థలాల్లో, రోడ్లకు పక్కన చెత్తను వేస్తూ పరిసరాల అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. రెండ్రోజులుగా వర్షం కురుస్తుండడంతో దీనికి తోడు ఎక్కడపడితే అక్కడ చెత్త పారేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. ఫలితంగా విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఇళ్లల్లో వెలువడే చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించకుండా ఖాళీ ప్లాట్లు, రోడ్ల పక్కన పడేస్తుండటంతో డంపింగ్ యార్డ్‌లను తలపించేలా అవి తయారవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీల్లో చెత్త వేస్తున్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు, చెత్త వేసే వారికి జరిమానా విధించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు యాచారంలో అభినందన సభ

యాచారం: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు చేసిన రుణమాఫీకి అభినందనలు తెలియజేస్తు సోమవారం యాచారం మండల కేంద్రంలో సభ నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో పాటు ధరణి కమిటీ సభ్యుడు, ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డిలు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు యాచారం మండల కేంద్రంలో జరిగే ఈ సభకు రైతులతో పాటు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.